# పొందికైన పొదుపు కథ!

ట్రెయిన్ జోరుగా పోతోంది. కంపార్టుమెంటులో ఎక్కువమంది ప్రయాణీకులు లేరు. ఉన్న ఐదాగురిలోనూ, ఆ పాతికేళ్ళ యువకుడు మాత్రం ఆట్టే వాగేస్తున్నాడు. సినిమాలతో మొదలైన అతగాడి ఉపన్యాసం పొదుపు ఉద్యమం వరకూ వచ్చేసింది. మరే దోవా లేక పక్కనే కూర్చునివున్న పెద్దమనుషు లిద్దరూ, వీలునుబట్టీ, ఓపికనుబట్టీ "ఊఁ" కొడుతున్నారు.

"ఏదేనా కొంతడబ్బు, రాబడిలోనుంచి ఆదా చెయ్యటం. ఆ చేసినదాంతో తమ కుటుంబాని కుపయోగించే పరికరాల్ని కొనటంలాంటి పనులు మన గృహిణులూ, గృహస్థులూ నేర్చుకోవాలండి!" ఆ సందేశాన్నిచ్చి. అతను అలసటగా ముఖం కర్చీఫ్‌తో తుడుచుకున్నాడు. అందాకా పరధ్యానంగా పడుకుని ఉన్న మావారు, ఉలిక్కిపడ్డట్టుగా నా వేపు చూచారు.

"విన్నావా? అతగాడి మాటలు?" అన్నట్టుగా వున్నాయి ఆ చూపులు. అంతటితో ఆగక, చూపులవెనుక చిన్న చిరునవ్వు రేఖ తొంగిచూచింది. ఆ చిరునవ్వులో శతకోటి అర్థాలు కనిపించాయి. నాకు ఒక్కసారిగా ఉక్రోషం ముంచుకువచ్చింది. ముఖం పక్కకు తిప్పుకున్నాను. వచ్చేనవ్వు బలవంతాన ఆపుకుంటూ వారూ అటువేపు తిరిగారు. తలతిప్పా

కున్నానే కానీ తలలో ఆలోచనలు మాత్రం మావారి నవ్వు లోని అంతరార్థంలోకి వెళ్ళిపోయినై!

ఒక్కసారిగా గతించిన కాలంలోకి — విద్యార్థినీ దశ లోకి వెళ్ళిపోయాను.

ఇంటరు పరీక్షలు సరిగ్గా మూడు నెలలున్నై! ఓ రోజు సాయంత్రం అన్నయ్యా, నేనూ హఠాత్తుగా ఓ నిర్ణయాని కొచ్చాము. ఈసారి శెలవులకు వెళ్ళినప్పుడు నాన్నగారిని మెప్పించాలీ అని! నాన్నగారికి డబ్బు పొదుపు చెయ్యటాని కుండే తాపత్రయంలో నాలుగోవంతు దేవుడిమీదవున్నా, ఆయనీపాటికి హిందూదేశంలోని యోగీశ్వరులలో అగ్రగణ్యు లయ్యేవారు! అలాటి నాన్నగారి మెప్పు సంపాదించాలీ అంటే, డబ్బు ఆదాచేసి పట్టుకెళ్లాలి! కానీ ఎలా? నాన్నగారికి చదువు కునే రోజుల్లో లెక్కల్లో ఎన్ని మార్కులొచ్చేవో తెలీదుకాని, మా ఇద్దరికి నెలకయ్యే ఖర్చులు, అణా పైసలతో లెఖ్ఖకట్టి, మరీ పంపేవారు డబ్బు!

"పై ఖర్చులకేమీ ఉండటంలేదు. ఎలా అమ్మా" అంటూ అమ్మదగ్గర జాయింటుగా వాపోయాము నేనూ, అన్నయ్యా!

"మీలాటివాడే వస్తాడేమో దానికి! ఇక్కడేనా కాస్త సుఖపెట్టకుంటే ఎలా? బస్తీలో వుంటూ, చదువుకునే పిల్లలకు, గిరిగీచి లెక్కకట్టి పంపించకుంటే, ఓ పదిరూపాయలు ఎక్కువ పంపిస్తే ఏం పోయింది?" అంటూ అమ్మ అంతర్యుద్ధం ప్రకటించింది.

రూపాయికి వందచొప్పున, లెక్కతేల్చి అమ్మకు చీవాట్లు ఇచ్చేసి మా ఇద్దరికి మరో పదిరూపాయలు అదనంగా శాంక్షన్ చేశారు నాన్నగారు! శలవులయిన తర్వాత కాలేజీలకు వచ్చేముందు, "చూడండి పిల్లలూ! మీ అమ్మ ఇన్నేళ్ళుగా నాతో కాపురం చేస్తున్నా, ఆదా చెయ్యటం అంటే ఏమిటో అది తెలుసుకోలేదు! పంపించిన డబ్బంతా ఖర్చు చేసుకోటమేకాదు - పొదుపు చెయ్యటం గ్రహించాలి. ..ఊఁ బండి ఎక్కండి!" అంటూ డబ్బు అన్నయ్య చేతికిచ్చేస్తారు నాన్నగారు.

నాన్నగారికి ఆదాచేసి డబ్బు ఇస్తే, మేము దేవతలం అయిపోతాము క్షణంలో!

"అయితే ఎలారా అన్నయ్యా డబ్బు మిగిల్చేదీ ? అసలే చాలక ఛస్తుంటేనూ ?" అన్నాను విసిగి - ఎందుకొచ్చిన పీడరా బాబూ ఇది అనుకుంటూ!

"ఏముందీ ? స్వంత ఖర్చులు తగ్గించుకుందాం!" అన్నాడు అన్నయ్య హుందాగా!

"అంటే సినిమాలా" అన్నాను బిక్కచచ్చిపోతూ.

"నే మ్యాట్నీలు మానుకుంటాను. మనిద్దరం కలిసి వెళ్లే సినిమాలూ, నువ్వు వారానికోసారి కాలేజిలో దానాలు చేసే చందాలూ మానుకోవాలి!"

"ఎందుకొచ్చిన పొదుపురా అన్నయ్యా ఇది! ఏదీ ఒద్దులే!" అన్నాను చిరాకుగా.

"ఛ! ఛ! అపాచ్యాలు పలుకబోకు, దేశం నలు మూలలా పొదుపు ఉద్యమం పాకిపోతూవుంటే, వెధవది ఆ మాత్రం త్యాగం చెయ్యలేకుంటే ఎందుకీ మానవజన్మ?" అన్నయ్య ఉపన్యాసకుడి ముఖం పెట్టేశాడు. అల్లాగే చూస్తూ ఊరుకుంటే, వాడిక మాట్లాడటం ఆపడు.

"అయితే ఈ మూడు నెలల్లోనూ, మహా యెక్కువగా ఆదా చేస్తే ఓ పదిహేను రూపాయలు మిగిలించగలుగుతాం, కదూ? ఆకాస్త పట్టుకెళ్ళి నాన్నగారికిస్తే ఏమంటాడు?" అన్నాను.

"అందుకే అమ్మడూ! నిన్ను చిన్నప్పుడు బామ్మ ముద్దుగా "మొద్దూ" అని పిలిచేది! పిచ్చి చెల్లాయీ! ఈ మూడు నెలల్లోనూ నాన్నగారి చేత, ఏదో ఖర్చులపేరిట ఏభై రూపాయిలేనా తెప్పించనూ? అవే మిగిలించి, ఆదా చేసి ఆయన గారికిద్దాం! ఏమంటావ్?" అన్నయ్య ధీమాగా అన్నాడు.

"నాన్నగారి దగ్గర్నుంచా? ఏభై రూపాయలా!" అన్నాను ఆశ్చర్యంగా!

"ఊఁ" అన్నాడేగాని అన్నయ్య ముఖంలో కూడా రంగులు మారిపోయాయి! ఆరు నెలల క్రితం జరిగిన సంఘటన నా బుర్రలో తళుక్కున మెరిసింది!

"మ్యాటినీకి వెళ్తా"నని వెళ్ళిన అన్నయ్య అరగంటలో తిరిగిరావటంచూచి ఆశ్చర్యపోయాను.

రూంలోకొచ్చి కుర్చీలో కూలబడిపోతూ "అమ్మాయ్ బుకింగ్ దగ్గర రష్‌లో పదిరూపాయల నోటు కొట్టేశారే

ఎవరో!" అన్నాడు దిగాలుగా! వాడిముఖం చూస్తుంటే జాలేసింది! "పోతే పోయిందిలేరా అన్నయ్యా!" అన్నాను ఓదారుస్తూ! కానీ తర్వాత ఎలా? అనే సమస్య వేధిస్తోంది! కాస్త తెరుకున్న తర్వాత అన్నయ్యే చెప్పాడు ఉపాయం.

"ఈ నెలలో ఒచ్చినవన్నీ మంచిపిక్చర్లే! ఏ ఒక్కటి చూడకున్నా ప్రాణాపాయం సంభవిస్తుంది. ఏదో ఖర్చులయినాయని వెంటనే నాన్నగారిని మరో పదిరూపాయలు అదనంగా పంపించమని రాస్తాను...ఏం?" అన్నాడు అన్నయ్య! తలూపాను.

నాన్నగారి దగ్గర్నుంచి సుముఖంగానే జవాబు వచ్చింది. కానీ చివర "పోయిన నెలలో అయిన ఖర్చుల వివరాల పట్టిక వ్రాసి పంపు! అల్లాగే డబ్బు పంపిస్తాను" అని వ్రాశారు నాన్నగారు.

మూడురోజులు, రాత్రింబగళ్లు ఏకగ్రీవంగా ఆలోచించాము. లిస్టు అంతా తయారయింది. కానీ అన్నయ్య పోగొట్టుకున్న పదిరూపాయలలో ఐదురూపాయలు ఎలా ఖర్చు వ్రాయాలో బుర్ర బద్దలుకొట్టుకున్నా తోచలేదు. ఉండి ఉండి అన్నయ్యకో మాంఛి అయిడియా వచ్చింది. "టూత్ పేస్టు" అని వ్రాసి ఎదురుగా ఆరు రూపాయలు బిల్లు వేశాడు నాన్నగారికి ఉత్తరం వ్రాస్తూ.

"ఈ నెలలో మా స్టూడెంట్సుకు "మెడికల్ టెస్టు" జరిగింది. డాక్టరుగారు టూత్ పేస్టు వాడమని మాకు చెప్పారు. అందువల్ల ఖర్చు కొంత ఎక్కువగానే అయ్యింది.

చాలాచాలా విచారిస్తున్నాము.'' అంటూ వ్రాసి విని పించాడు.

పళ్లు తోముకోటం మొదలెట్టిం దగ్గరనుంచీ వేపపుల్ల ఉపయోగించే నాన్నగారు, అంత ఎక్కువగా దీన్ని గురించి ఆలోచించరు లెమ్మనుకున్నాను. బాగుందన్నాను.

మూడోరోజు పోస్టులో నాన్నగారి దగ్గర్నుంచి, మున్ముందు మా బాధ్యతల్ని గురించి డబ్బు ఆదా చేయవలసిన పద్ధతులను గురించీ ఎనిమిది పేజీల ఉత్తరం వచ్చింది. ఆఖరున నాన్నగారు వ్రాసిన నోటీస్ చదువుక కూలబడ్డాడు అన్నయ్య! ఇలావుంది :

"N. B. నీ పట్టిక అంతా బాగుంది. కానీ "టూత్ పేస్టు'' ఎదురుగా ఆరు రూపాయలు ఖర్చురాశావు. దానిని బట్టిచూస్తే, పోయిన నెలలో భోజనానికి బదులు మీరిద్దరూ "టూత్ పేస్టు'' తిన్నట్లుగా నాకనిపిస్తున్నది. మరెప్పుడూ అలాటి అవకతవక పనులు చెయ్యొద్దు. రెండురోజుల్లో మన మల్లయ్యగారి వెంకన్న చేత ఎనభైయారు వేపపుల్లలు (రెండు నెలలా ఇరవైరోజులకుగానూ) నీకూ, ఓ చిన్నడబ్బా కచ్చికలు అమ్మాయికీ పంపుతున్నాను. చేరచూసుకు నేది !''

ఎట్లాగో డబ్బైతే వచ్చిందిగానీ, నాన్నగారు మెత్తగా అంటించిన చురక మాత్రం బాగా జ్ఞాపకం ఉండిపోయింది.

ఈ ఆలోచనే అన్నయ్య క్కూడా వచ్చిందిలావుంది. తిన్నగా కోలుకుని "ఎల్లాగో నే చూస్తాలే అమ్మాయ్ !'' అంటూ బయటికి వెళ్ళిపోయాడు. మర్నాడు అన్నయ్య నాన్న

గారికి ఉత్తరం రాశాడు. మహాబలిపురం పిక్నిక్‌కు తప్పని సరిగా వెళ్ళాలి, ఓ యాభై రూపాయలు పంపించమని !

"పరీక్ష రోజుల్లో ఎక్స్‌కర్షన్ లేమిటో ! కాలవైపరీత్యం !" అనిరాసి, ఏ గ్రహబలం వల్ల నో ఏభై రూపాయలూ పంపించారు నాన్నగారు.

ఆ మూడు నెలల్లోను అష్టకష్టాలూ పడి, అనుకున్న దానికంటె ఎక్కువగానే కూడబెట్టాం ! మొత్తం మేము "ఆదా" చేసిన డబ్బు డెభ్భై ఐదురూపాయలు తేలింది. బ్రహ్మానందపడ్డాం ! మర్నాడు ఊరికి బయల్దేరుతాం ! ఆ రోజు సాయంత్రం నాకో దుర్బుద్ధి పుట్టింది.

"అన్నయ్యా ! ఉట్టినే డబ్బు పట్టుకెళ్ళేకంటే, ఇంట్లో ఫ్యాన్సీసామాను ఒక్కటీ లేదుగదా ? ఏవేనా వస్తువులుగా తీసికెడితేనో ?" అన్నాను.

"భేష్ ! వరహాల ఐడియా !" అన్నాడు అన్నయ్య !

డబ్బు చేతపుచ్చుకు బజార్లో పడ్డాం ! ఆ షాపు కీపర్ కొత్తగా వచ్చిన "వైట్ మెటల్" సామాను చూపించాడు.

కళ్ళు జిగేలు మంటూన్న ఆసామాను చూస్తూ మైమరచిపోయాము. టీసెట్టూ, మరచెంబూ నేను కోరు కున్నాను. "భవదీయుడు ఉద్యోగంలోచేరినా, ఓ కారీయర్ అంటూ ఉండొద్దా ?" అంటూ కారీయర్ తీసుకున్నాడు అన్నయ్య ! కొత్తగా రావటమూ బోణీకూడా మాదేలా వుంది, షాప్ కీపర్ మహాఆనందంతో సామానులూ అవీ మచ్చలు పడకుండా తుడవటానికో బ్రష్, ఏదో పౌడరూ,

బిల్లూ చేతికిచ్చాడు. బిల్లు చూస్తూ ఒక్కక్షణం పరలోకం లోకి వెళ్ళాము ఇద్దరమూ! ఎనభై రెండు రూపాయలు! అందాకా అయింతర్వాత వెనక్కుతీస్తే ఎలా? బిల్లు చెల్లించి, సామానుతో బండిలో కూర్చున్నాం. సంతృప్తిమాత్రం బాగావుంది ఇద్దరిలో! ఊరికివచ్చి, సామాను చూపిస్తూ, మేమెంత జాగ్రత్తగా డబ్బు ఆదాచేశామో, చెబుతూవుంటే నాన్నగారు పొంగిపోయారు. చిన్నతమ్ముడూ, చెల్లాయీ నిద్రాహారాల్లాంటి అవరోధాలు మానుక ఊళ్ళోవాళ్ళకు అవి చూపించారు! ఊరు ఊరంతా అసలే మాంఛి పల్లెటూరు కావటంవల్ల ఆకాశాని కెత్తేశారు మమ్మల్నిద్దర్నీ!

గిరుక్కున ఆరునెలలు తిరిగాయి. ఎక్కువగా వాడితే చెడిపోతాయనే సదుద్దేశ్యంతో ఓ చెక్కపెట్టెలోపెట్టి తాళం వేశేశాను టీసెట్టూ వగైరాలను! కాలంతోబాటు మనుష్యుల్లోకూడా ఎన్నోమార్పులు వస్తుంటాయి! నాకు పెళ్ళయింది! మూడునిద్రలకు ట్రెయిన్‌లో పోతూండగా నావెదురుగానే అన్నయ్యకోతలు కోశేస్తున్నాడు. ఆ "వైట్ మెటల్" సామానుకోసం అవస్థపడిందీ, దాచేసిందీ నేనే బావగారూ! అయాచితంగా చెల్లాయికూడా పంచేసుకుందా కీర్తి" అంటూ! నాకు చిర్రెత్తుకొచ్చింది! ఏంచేస్తాను? కొత్త పెళ్ళికూతుర్ని కావటంతో, స్త్రీసహజమైన సిగ్గుచేత ఆట్టే అన్నయ్యతో దెబ్బలాడలేక పోయాను. కానీ ఆతర్వాత మావారికి నచ్చచెప్పేశాను. అందులో అన్నయ్య గొప్పతనమేమీ లేదనీ, అంతా నా తెలివితేటలేననీ! చిరునవ్వునవ్వి ఊరుకున్నారు వారు వింటూ!

అత్తారింటికి వెళ్లే ముందురోజు వరకూ "నా కారీయర్ నేనే ఉంచుకుంటా ?" అంటూన్న అన్నయ్య హఠాత్తుగా ఆ రోజు సాయంత్రం వాళ్ళ బావగారి ముందే "అమ్మాయ్, ఎక్కువ కష్టపడ్డది నువ్వే. అంత సామానూ నువ్వే పట్టుకెళ్లు!" అనటంతో, అన్నయ్యలోని ఆ నిస్వార్థపరతకు కళ్ళనీళ్ళు తిరిగాయి! కొత్తకాపురం పెట్టిం తర్వాత కాస్త స్థిమితపడే వరకూ "వైట్ మెటల్" సామాన్లుపెట్టె తియ్యటానికి వీలు చిక్కలేదు. ఆ రోజు ఆదివారం! తీరిగ్గా అవన్నీచూచి ఆనందించాలనే ఉద్దేశ్యంతో మా శ్రీవారు తాళంచెవి పుచ్చుకున్నారు. మావారు పెట్టె మూతతీసి ఆశ్చర్యంగా చూస్తూ ఉండి పోయారు! దూరంగా ధీమాగా నిల్చునిఉన్న నేను నవ్వుకున్నాను, అలాటి వస్తువుల్ని వారు జన్మలో చూళ్ళేదు కాబోలు అనుకుంటూ!

మెల్లిగా తమాయించుకొని ఒక్కొక్క కప్పూ, సాసరూ తీసి కిందపెట్టడం మొదలెట్టారు వారు, నవ్వులో ఉక్కిరి బిక్కిరౌతూ! ఈసారి నా కళ్ళను నేనే నమ్మలేక పోయాను! ఇనుమూ కాదు - ఇత్తడీ కాదు. ఏదో లోహం! పది పన్నెండేళ్ళుగా ఉపయోగించకుండా మూలపడేసిన కంచు సామానులా మచ్చలు పడివున్నాయి. అక్కడక్కడా నన్ను వెక్కిరిస్తూ ఒక్కో తెల్లమచ్చా! అన్నయ్య కారీయర్ అసలదేం లోహమో కూడా అంతుపట్టలేదు! పెట్టెతీసి చూచాడు కాబోలు! అన్నయ్య కారీయర్ వద్దన్నదాన్లో ఆంతర్యం నాకు బోధపడింది! బండి ఎక్కేముందు నా పొదుపరితనాన్ని గురించి నాన్నగారు చెప్పిన మాటలు గుర్తుకొచ్చాయి

కాబోలు, ఎదురుగా ఆ సామాను చూస్తూ విరగబడి నవ్వుతున్నారువారు! కళ్ళనీళ్ళు కాల్వలు కట్టాయి అవమానంతో, బాధతో! పొరలివచ్చే నవ్వు ఆపుకుంటూ నన్ను ఓదార్చారు మావారు!

ఎప్పుడేనా "డబ్బు ఇబ్బందిగావుంద"ని వారు అంటే, పొరపాటుగా, "నా చేతి కివ్వండి, నే సర్దుబాటు చేసి ఆదా చేస్తాను" అంటానా బింకంగా!

"నీకు పుణ్యంవుంటుంది. నువ్వు ఆదా చెయ్యకుండా వుంటే, సర్దుబాటు చేసినంత ఫలం!" అంటారు వెక్కిరిస్తూ.

"ఇదో! స్టేషన్ వస్తోంది. బాబును లేపు!" అంటూన్న వారి పిలుపుతో, నిద్రమత్తులో నుంచీ, జరిగిపోయిన సంఘటనల తాలూకు స్మృతిపథంలోనుంచి ఇవతలకు వచ్చాను.